# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

బుధవారం 29, జూలై 2026 | సంపుటి : 03 | సంచిక : 158 | పేజీలు : 05 | వెల ₹5


## గణపురం కాల్వల అభివృద్ధికి రూ.31 కోట్లు

○ 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే గండ్ర

3





## మిర్చి రైతు నెత్తిన దామిని పిడుగు!

### ఆర్కే సీడ్స్ మాయాజాలం.. మొలకెత్తని విత్తనాలతో ఆగమాగం

- ఎక్కడిదీ కంపెనీ? ఏదీ గ్యారెంటీ?
- విచారణ పేరిట వ్యవసాయ అధికారుల వింత పోకడలు
- 30 వేల ప్యాకెట్ల విక్రయం వెనుక అసలు కథేంటి?
- రాజేంద్రనగర్ ల్యాబ్‌కు చేరిన విత్తన నమూనాలు

5

**అక్షరదర్బార్, పరకాల :**

గతేడాది మంచి దిగుబడి, కళ్లు చెదిరే ధర రావడంతో ఈసారి ఎన్నో ఆశలతో మిర్చి సాగుకు ముందుకొచ్చిన పరకాల, నడికూడ మండలాల రైతుల ఆశలపై నీళ్లు చల్లారు కొందరు వ్యాపారులు. నాసిరకం విత్తనాలతో అన్నదాతలను నిలువునా ముంచుతున్నారు. 'దామిని 541' పేరుతో మార్కెట్లోకి వచ్చిన మిర్చి విత్తనాలు ఇప్పుడు రైతుల పాలిట శాపంగా మారాయి. విత్తనాలు మొలకెత్తక పోవడంతో అనుమానం వచ్చిన రైతులు రోడ్డెక్కగా.. డీలర్లు, వ్యవసాయ అధికారుల తీరుపై ఇప్పుడు తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరకాల పట్టణంలోని 'ఆర్కే సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్'లో విక్రయించిన 'దామిని 541' రకం విత్తనాలు రైతుల పాలిట గుదిబండగా మారాయి. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి విత్తనాలు నాటితే.. కనీసం మొలకలు కూడా రాని దుస్థితి నెలకొంది. ఈ దామిని 541 విత్తనాలు తయారు చేసిన అసలు కంపెనీ ఏది? వాటికి సరైన అనుమతులు ఉన్నాయా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. బ్యాచ్ నంబర్లు, సీడ్ సర్టిఫికెట్లు, తయారీ వివరాలు, సరఫరా మార్గంపై కనీస స్పష్టత లేకపోవడం వ్యాపారుల మోసానికి అద్దం పడుతోంది.




## ఉలికిపాటు

- టన్నల్‌కే కన్నంపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల ఆరా
- రంగంలోకి ఇంటెలిజెన్స్ వర్గాలు.. అప్రమత్తమైన నీటిపారుదల శాఖ
- భూగర్భ సొరంగంపై అక్రమ బోరుబావుల లెక్క తేలుస్తున్న యంత్రాంగం
- క్షేత్రస్థాయి పరిశీలనకు అధికారుల కసరత్తు
- 'అక్షరదర్బార్' కథనానికి స్పందన

5

## పెద్దికి మెరుగైన వైద్యం అందించాలి

- డాక్టర్లకు మంత్రి పొంగులేటి సూచన
- ఎమ్మెల్యే దొంతితో కలిసి హాస్పిటల్ సందర్శన

2



## టోర్నడో బీభత్సం

### నేలకూలిన వందలాది చెట్లు, స్తంభించిన రాకపోకలు

4

**అక్షరదర్బార్, మంగపేట:**

ములుగు జిల్లా మంగపేట మండలంలో ఊహించని రీతిలో టోర్నడో (చక్రవాతం) బీభత్సం సృష్టించింది. మండల పరిధిలోని కోమటిపల్లి గ్రామం వద్ద మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వీచిన బలమైన ఈదురు గాలుల దాటికి ప్రకృతి ఉగ్రరూపం దాల్చింది. నిమిషాల వ్యవధిలోనే సంభవించిన ఈ విపత్తుతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. – వివరాలు 3లో..

# 1 నుంచి 'యాక్సిడెంట్ ఫ్రీ' డ్రైవ్

- 'అరైవ్ అలైవ్'ను విజయవంతం చేయండి
- మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు
- భూపాలపల్లి ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ హెచ్చరిక

**అక్షరదర్బార్, భూపాలపల్లి:**

రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, సురక్షిత రవాణా వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఆగస్టు 1 నుంచి భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా "అరైవ్ అలైవ్ స్పెషల్ డ్రైవ్" నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ తెలిపారు. పోలీసు, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక తనిఖీ కార్యక్రమం జరగనుంది. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తూ ఎస్పీ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లాలో ప్రమాదాల సంఖ్యను తగ్గించి ప్రతి ప్రయాణాన్ని సురక్షితంగా మార్చడమే ఈ డ్రైవ్ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్, అతివేగం, హెల్మెట్, సీటుబెల్ట్ ధరించకపోవడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించడం వల్లనే అధిక శాతం ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన



వ్యక్తం చేశారు.

**ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

డ్రైవ్‌లో భాగంగా మైనర్లు వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా బైక్ రైడింగ్, ట్రిపుల్ రైడింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం (డ్రంక్ అండ్ డ్రైవ్), సీటుబెల్ట్ ధరించకపోవడం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ మాట్లాడటం, రాంగ్ రూట్ డ్రైవింగ్‌లపై జిల్లా వ్యాప్తంగా విస్తృత తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

**తల్లిదండ్రులకు హెచ్చరిక**

18 సంవత్సరాల లోపు మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టవిరుద్ధమని ఎస్పీ స్పష్టం చేశారు. మైనర్లు వాహనాలు నడిపితే వాహన యజమానులు, తల్లిదండ్రులు లేదా సంరక్షకులపై మోటారు వాహనాల చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని సూచించారు.

**భద్రతే మన బాధ్యత**

ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన నాణ్యమైన హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని, నిర్ణీత వేగ పరిమితిని పాటించాలని పిలుపునిచ్చారు. రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతని పేర్కొన్నారు. ప్రజల సహకారంతోనే ప్రమాదరహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, ఈ స్పెషల్ డ్రైవ్‌ను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



## ప్రత్యామ్నాయ పంటల సాగు అభినందనీయం

- కలెక్టర్ రాహుల్ శర్మ
- గుర్రంపేటలో కంది పంట సాగును పరిశీలించిన కలెక్టర్
- రైతులకు నిరంతరం మార్గదర్శనం చేయాలని అధికారులకు ఆదేశం

**అక్షరదర్బార్, జయశంకర్ భూపాలపల్లి :**

వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయడం ఎంతో అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం గుర్రంపేటలో కంది పంట సాగును ఆయన పరిశీలించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఎల్ నినో ప్రభావంతో తలెత్తే నీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని రైతులు అవగాహనతో పంట మార్పిడి చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు. గతంలో సాగు చేసిన పంటలు, ఈ ఏడాది ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సాంప్రదాయ పంటలకు భిన్నంగా ఎక్కువ లాభాలనిచ్చే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు నిరంతరం మార్గదర్శనం చేwఈయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా ఉద్యానవన అధికారి తిరుపతి, తహసీల్దార్ లక్ష్మి రాజయ్య, అధికారులు పాల్గొన్నారు.



## హెచ్ ఎంలకు షోకాజ్ నోటీసులు

- మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలి.. : డీఈఓ

అక్షరదర్బార్, ములుగు: ములుగు జిల్లాలోని పాఠశాలలు, కాంప్లెక్స్ లు, మండల విద్యా వనరుల కేంద్రాలకు ఈనెల 24న 202526 ఆర్థిక సంవత్సరం కోసం నిర్వహించబడిన ఆడిట్ కి హాజరు కాని ప్రధానోపాధ్యాయులు, సంబంధిత విభాగ అధిపతులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ములుగు జిల్లా విద్యాశాఖ అధికారి ఏ సిద్ధార్థ రెడ్డి తెలిపారు. ఆడిట్ కి హాజరుకాని వారిలో 24 పాఠశాలలు, మూడు కాంప్లెక్స్ పాఠశాలలు, మూడు మండల విద్యా వనరుల కేంద్రాలు, ఒక కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం, రెండు పీఎం శ్రీ పాఠశాలలు ఉన్నాయని ఆయన తెలిపారు. షోకాజ్ నోటీసులు జారీ చేయబడిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు మూడు రోజుల్లోగా రాతపూర్వక వివరణ ఇవ్వాలని, లేనిచో వారిపై శాఖపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోబడతాయని వారు తెలిపారు.

# పెద్దికి మెరుగైన వైద్యం అందించాలి

## డాక్టర్లకు మంత్రి పొంగులేటి సూచన

**ఎమ్మెల్యే దొంతితో కలిసి హాస్పిటల్ సందర్శన**

అక్షరదర్బార్, హైదరాబాద్: రెండు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పరామర్శించారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో కలిసి హాస్పిటల్‌కు వెళ్లిన మంత్రి, సుదర్శన్ రెడ్డి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా పెద్ది సుదర్శన్ రెడ్డికి అందిస్తున్న చికిత్స వివరాలను అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అత్యుత్తమ మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య బృందానికి సూచించారు. అనంతరం ఆస్పత్రిలో ఉన్న సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, ఆయన త్వరగా కోలుకోవడానికి, ఆరోగ్య సంరక్షణకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను ప్రభుత్వం తరపున అందిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి భరోసానిచ్చారు.





## పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన రాణా ప్రతాప్ రెడ్డి

**యశోద ఆసుపత్రిలో మాజీ ఎమ్మెల్యే ఆరోగ్యంపై ఆరా**

**ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచన**

అక్షరదర్బార్, నర్సంపేట : తీవ్ర అస్వస్థతకు గురై సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డిని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే ఉన్న పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, మనోధైర్యంతో ఉండాలని ఓదార్చారు.



# గీత కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

- కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మల్లేష్ గౌడ్
- ఏజెన్సీ పేరుతో రద్దు చేసిన సొసైటీలను పునరుద్ధరించాలి
- గోవిందరావుపేటలో బస్సు యాత్ర పోస్టర్ ఆవిష్కరణ

అక్షరదర్బార్, ములుగు : కల్లు గీత కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కల్లు గీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు రుద్రబోయిన మల్లేష్ గౌడ్, కార్యదర్శి వత్సవాయి సారయ్య గౌడ్ డిమాండ్ చేశారు. గోవిందరావుపేట మండల కేంద్రంలో సొసైటీ అధ్యక్షుడు కాసగాని స్వామి గౌడ్ అధ్యక్షతన బస్సు యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏజెన్సీ పేరుతో రద్దు చేసిన సొసైటీలను పునరుద్ధరించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 2న మహబూబాబాద్‌లో ప్రారంభమయ్యే బస్సు యాత్ర 16న ములుగు చేరుకుంటుందని, 18న కిలాషాపురంలో భారీ బహిరంగ సభతో ముగుస్తుందన్నారు. గీత కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బస్సు యాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ గౌడ్, సీనియర్ నాయకులు భిక్షం గౌడ్, రాజుగౌడ్, రాజ్ శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గణపురం కాల్వల అభివృద్ధికి రూ.31 కోట్లు

- 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ ఉత్సవాల్లో ఎమ్మెల్యే గండ్ర



అక్షరదర్బార్, భూపాలపల్లి: గణపురం రిజర్వాయర్ పరిధిలోని నాలుగు ప్రధాన పంట కాల్వల అభివృద్ధికి ప్రభుత్వం రూ.31 కోట్ల నిధులను మంజూరు చేసిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. మంగళవారం గణపురం రైతు వేదికలో నిర్వహించిన 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ.. కాల్వల అభివృద్ధి పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయ్యాక 12 నెలల్లో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతం అనిశ్చితంగా ఉండే అవకాశం ఉందని, నీటి లభ్యతపై స్పష్టత లేని పరిస్థితుల్లో రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో పండే పెసర్లు, కందులు, కూరగాయలు వంటి పంటలను సాగు చేయాలని విజ్ఞప్తి చేశారు.

### 44 వేల ఎకరాలకు సాగునీరు

ఎస్ఆర్ఎస్పీ ప్రాజెక్టు నీటిని దేవాదుల ద్వారా 44 వేల ఎకరాలకు చేరేలా చర్యలు చేపట్టామని, గణపురం చెరువు అభివృద్ధికి కూడా ప్రత్యేక నిధులు మంజూరు చేయించామని ఎమ్మెల్యే వివరించారు. దళారుల దోపిడీని అరికట్టి గతంలో మక్క రైతులకు ఎకరాకు రూ.లక్షకు పైగా ఆదాయం వచ్చేలా చూశామని గుర్తుచేశారు. గ్రామస్థాయి సమావేశాలు నిర్వహించి ఏ పంటలు వేయాలో రైతులు సామూహికంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

### ఉద్యానవన పంటలతో అధిక ఆదాయం

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. భూగర్భ జలాలు తగ్గుతున్న దృష్ట్యా రైతులు కరువును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఉద్యానవన, ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బాబురావు, ఏడీఏ రమేష్, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ భాస్కర్, రైతు విజ్ఞాన వేదిక శాస్త్రవేత్త డాక్టర్ విశ్వతేజ, సింగిల్ విండో చైర్మన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# డెడ్ లైన్ ఆగస్ట్ 15

## జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న

### నగరంలోని అనధికారిక ఫ్లెక్సీలు, బిల్‌బోర్డులు తొలగించాలి

**అక్షరదర్బార్, వరంగల్:**

గ్రేటర్ వరంగల్ నగరంలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన అన్ని అనధికారిక ఫ్లెక్సీలు, బిల్‌బోర్డులు, బ్యానర్ల తొలగింపు ప్రక్రియను ఆగస్టు 15లోపు పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి వెంకన్న అధికారులను ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించి ఫ్లెక్సీలు, బిల్‌బోర్డులు ఏర్పాటు చేసే వారిపై మున్సిపల్ చట్టం ప్రకారం భారీ జరిమానాలతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మంగళవారం నగరంలో టౌన్ ప్లానింగ్, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్), జీడబ్ల్యూఎంసీ సిబ్బంది సంయుక్తంగా చేపడుతున్న ప్రత్యేక డ్రైవ్‌ను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫ్లెక్సీలు, బిల్‌బోర్డుల తొలగింపు పనులను మరింత వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగర సౌందర్యాన్ని దెబ్బతీసే విధంగా విచ్చలవిడిగా ఫ్లెక్సీలు, బ్యానర్లు, బిల్‌బోర్డులు ఏర్పాటు చేయడాన్ని ఏ మాత్రం సహించబోమన్నారు. మున్సిపల్ అనుమతి లేకుండా ఎలాంటి ప్రచార సామగ్రిని




ఏర్పాటు చేయరాదని ఇప్పటికే పలుమార్లు సూచించినప్పటికీ కొందరు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని పేర్కొన్నారు.

నగర సుందరీకరణ కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో అన్ని అనధికారిక ఫ్లెక్సీలు, బిల్‌బోర్డులను పూర్తిగా తొలగిస్తున్నామని తెలిపారు. అనంతరం రెండో విడతలో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ భవనాలు, గోడలపై అనుమతి లేకుండా రాసిన వాల్ రైటింగ్స్, పోస్టర్లు, పెయింటింగ్‌లను తొలగించి, వాటి స్థానంలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతిబింబించే ఆకర్షణీయమైన వాల్ పెయింటింగ్‌లను రూపొందించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌ను నిరంతరాయంగా కొనసాగించి నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. ప్రజలు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమానికి సహకరించాలని విజ్ఞప్తి చేసిన ఆయన, మున్సిపల్ అనుమతి లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు, బిల్‌బోర్డులు ఏర్పాటు చేసినట్లయితే మున్సిపల్ చట్టం ప్రకారం భారీ జరిమానాలు విధించడంతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నగర సౌందర్య పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని, అందరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.




# ఉబర్ బైక్ సేవలు వరంగల్‌లో ప్రారంభం

- తొలి రైడ్ ఉచితం.. డ్రైవర్లకు హెల్మెట్ల పంపిణీ

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ నగరంలో ఉబర్ బైక్ సేవలను ఉబర్ సంస్థ ప్రారంభించింది. ప్రారంభ ఆఫర్‌గా కొత్త ప్రయాణికులకు పరిమిత కాలం పాటు తొలి రైడ్‌ను ఉచితంగా అందిస్తున్నట్లు ప్రకటించింది. ఉద్యోగాలు, కళాశాలలు, రోజువారీ అవసరాలకు వేగవంతమైన, సరసమైన రవాణా సౌకర్యంతో పాటు స్థానిక డ్రైవర్లకు ఆదాయ అవకాశాలు కల్పించడమే లక్ష్యమని తెలిపింది. ప్రారంభ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి తోట పవన్ ఉబర్ బైక్ డ్రైవర్లకు ఐఎస్ఐ ప్రమాణాల హెల్మెట్లు పంపిణీ చేశారు. నగరంలో ఫస్ట్-లాస్ట్ మైల్ కనెక్టివిటీ మెరుగుపడుతుందని వారు పేర్కొన్నారు. ఉబర్ ఇండియా కన్స్యూమర్ అండ్ గ్రోత్ డైరెక్టర్ రిషాంత్ ఘోష్ మాట్లాడుతూ.. వరంగల్ ప్రజలకు విశ్వసనీయమైన రవాణా సేవలతో పాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఉబర్ కట్టుబడి ఉందన్నారు.

# టోర్నడో బీభత్సం

## నేలకూలిన వందలాది చెట్లు, స్తంభించిన రాకపోకలు

**అక్షరదర్బార్, మంగపేట:**

ములుగు జిల్లా మంగపేట మండలంలో ఊహించని రీతిలో టోర్నడో (చక్రవాతం) బీభత్సం సృష్టించింది. మండల పరిధిలోని కోమటిపల్లి గ్రామం వద్ద మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వీచిన బలమైన ఈదురు గాలుల దాటికి ప్రకృతి ఉగ్రరూపం దాల్చింది. నిమిషాల వ్యవధిలోనే సంభవించిన ఈ విపత్తుతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.



**3–4 కిలోమీటర్ల మేర విధ్వంసం**

ఈ టోర్నడో ప్రభావంతో కోమటిపల్లి పరిసర ప్రాంతాల్లో సుమారు 3 నుండి 4 కిలోమీటర్ల పరిధిలో భారీ నష్టం వాటిల్లింది. ప్రచండమైన గాలుల హోరుకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న వందలాది ఏళ్ల నాటి భారీ వృక్షాలు, పచ్చని చెట్లు వేళ్లతో సహా నేలకొరిగాయి. చెట్ల కొమ్మలు విరిగిపడటంతో పాటు పలు చోట్ల విద్యుత్ స్తంభాలు కూడా దెబ్బతిన్నట్లు సమాచారం.

**స్తంభించిన రాకపోకలు**

రహదారిపై భారీ వృక్షాలు అడ్డంగా కూలిపోవడంతో ప్రధాన రహదారిపై రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. ఇరువైపులా వాహనాలు భారీగా నిలిచిపోవడంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమాచారం అందుకున్న స్థానిక అధికారులు, పోలీసులు, సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని, జేసీబీల సహాయంతో చెట్లను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ హఠాత్ పరిణామంతో కోమటిపల్లి, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఉద్యానవన పంటలు, చెట్లకు తీవ్ర నష్టం వాటిల్లిందని, అధికారులు తక్షణమే నష్టపరిహారం అంచనా వేసి ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా జలసిరి

- **ఇంకుడు గుంతల నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి**
- **రాష్ట్ర మంత్రి సీతక్క**
- **ములుగు ఎంపీడీవో కార్యాలయంలో జలసిరి అవగాహన సదస్సు**

అక్షరదర్బార్, ములుగు: వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడమే ముఖ్య లక్ష్యమని, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పిలుపునిచ్చారు. మంగళవారం ములుగు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం, జలసిరి అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... "ఇంటింటికి ఇంకుడు గుంత - ఊరి కోసం ఊటకుంట - పంట కోసం పంటకుంట" నినాదంతో పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో అంగన్‌వాడీలు, మహిళా సంఘాల భవనాలు, రైతుల పొలాల్లో పంటకుంటల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, డైరెక్టర్ భగవాన్ రెడ్డి, ఎంపీడీవో సందీప్ తదితరులు పాల్గొన్నారు.




# రైస్ మిల్లర్లపై విజిలెన్స్ దాడులను నిలిపివేయాలి

- **జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్**
- **మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేసిన రైస్ మిల్లర్ల సంఘం**
- **వెంటనే స్పందించి పౌరసరఫరాల మంత్రితో మాట్లాడిన సీతక్క**

అక్షరదర్బార్, ములుగు : రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లర్లపై ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న విజిలెన్స్ దాడులను వెంటనే నిలిపివేయాలని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్ కోరారు. మంగళవారం జిల్లా రైస్ మిల్లర్లు అందరూ కలిసి రాష్ట్ర మంత్రి సీతక్కను మర్యాదపూర్వకంగా కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి సీతక్క వెంటనే పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బాదం ప్రవీణ్ మాట్లాడుతూ... సన్న బియ్యం పథకాన్ని విజయవంతం చేసే క్రమంలో నష్టపోతున్న మిల్లర్లపై ధాన్యం తరుగుదలను సాకుగా చూపి కేసులు పెట్టడం దారుణమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సహోదరి రెడ్డి, కోశాధికారి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



# పటిష్టంగా ఉండేలా చర్యలు

- **భూముల రీ సర్వేపై జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి**
- **అగ్రంపహాడ్ లో గ్రామసభ**

అక్షరదర్బార్, ఆత్మకూరు: భూముల రీసర్వే పటిష్టంగా ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం అగ్రంపహాడ్ గ్రామంలో భూములు కొలతల శాఖ ఆధ్వర్యంలో భూముల రీ సర్వేపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ రవి మాట్లాడుతూ ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వేయర్లు, లైసెన్సుడు సర్వేయర్లు భూముల రీ సర్వే చేస్తున్నారని పేర్కొన్నారు. భూముల రీ సర్వేలో రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలని సూచించారు. వివాదాలకు తావు లేకుండా భూముల రీ సర్వే ప్రక్రియ సాగుతుందన్నారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ మహేందర్, పరకాల ఆర్డీఓ డీఎస్ వెంకన్న, ఆత్మకూర్ తహసిల్దార్ జగన్మోహన్ రెడ్డి, భూములు కొలతలు శాఖ అధికారులు, ఇతర అధికారులు, రైతులు, స్థానికులు పాల్గొన్నారు.

# కేయూ వీసీకి గుండెపోటు..

- **ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు రిజిస్ట్రార్ వెల్లడి**



అక్షరదర్బార్, హన్మకొండ: కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ కే ప్రతాప్ రెడ్డి సోమవారం సాయంత్రం ఆఫీస్‌లో కొంత అసౌకర్యానికి గురి కావడంతో, క్యాంపస్ లోని హెల్త్ సెంటర్ లో అందుబాటులో ఉన్న డాక్టర్ కే బుచ్చిరెడ్డి ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు, ఈసీజీలో కొంత హెచ్చు తగ్గులు ఉండటంతో హనుమకొండలోని రోహిణి హాస్పిటల్ లో పర్యవేక్షణలో ఉంచి, మరిన్ని పరీక్షలు నిర్వహించారు. రిపోర్ట్ ప్రకారం, వైద్యుల సూచనలతో యాంజియోగ్రామ్ నిర్వహించి, స్టంట్ వేసినట్లు, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించినట్లు రిజిస్ట్రార్ వి రామచంద్రం తెలిపారు. వైస్ ఛాన్సలర్ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు, ఉద్యోగులు, విద్యార్థులు వారి ఆరోగ్య పరిస్థితి గురించి వాకాబు చేస్తున్నారని, ఎటువంటి ఆందోళన అవసరం లేదన్నారు.